# పిచ్చోడు

రాత్రి పది గంటల సమయం... స్కూటర్‌మీద ఘట్‌కేసర్‌నుంచి ప్రయాణం చేసొచ్చిన బడలిక... తొందరగా పడుకునే ప్రయత్నంలో అడ్డొస్తూ అస్థిమితానికి గురిచేస్తున్న వెన్నెల... ఈ రోజు నిండు పున్నమి. దార్లో బాగానే పల్కరించింది. నగరారణ్యంలోకి ప్రవేశించగానే అలిగి ఆకాశం ముసుగులో ఎక్కడో దాక్కుంది. నాకు వెన్నెలంటే ఎంతిష్టమో! బాల్యం నుండీ అల్లుకుపోయిన అనుబంధం... నేను పుట్టి పెరిగిన పల్లెటూర్లో మాపొలంలోని మంచెమీద పడుకుని జానపద గీతాలేవో పాడుకుంటూ, ఉదారంగా కురుస్తున్న వెన్నెల సోయగాల్ని ఆస్వాదిస్తూ... ఎంత తీయటి అనుభూతి!

నా ఆలోచనల్ని భగ్నం చేస్తూ పెద్దగా కేకలు వినబడ్డాయి. ఎవరో ఎవర్తోనో పోట్లాడుతున్నాడు. గొంతు చినిగిపోయేలా అరుస్తున్నాడు. 'దగ్గరకు రాకు. నాచేతిలో కత్తుంది. పొడిచేస్తా. ఛో ఛో' అంటూ కోపంగా అరుస్తున్నాడు. గూండానో రౌడీనో అయి ఉంటాడు. ఖూనీకోరుకూడానేమో... చొక్కా తొడుక్కుని, చెప్పులేసుకుని బైటికొస్తున్నప్పుడు "మనకెందుకొచ్చిన గొడవ... వాడు తాగి ఉన్నాడేమో. చంపుకోటాలు జరిగితే లేనిపోని తలనొప్పి"అంది నా భార్య పద్మ.

కిందకు దిగి చూస్తే ఎవరో కుర్రాడితో మాట్లాడ్తున్న మా ఎదురు ఫ్లాట్లోని సుబ్రమణ్యం తప్ప ఎవ్వరూ కన్పించలేదు. నేను దిగేలోపల ఎటోళ్ళటు వెళ్ళిపోయారేమో?

"ఓ ఐదు నిముషాల క్రితం పెద్దగా కేకలు విన్పడ్డాయి. ఏమిటా గొడవ?" అని అడిగా.

"అదా. పాపం పిచ్చోడు. అప్పుడప్పుడూ ఇక్కడికొచ్చి అలా అరిచి

వెళ్ళిపోతాడు. ప్రమాదకారి కాదు" అన్నాడు సుబ్రమణ్యం.

మరలా పెద్దగా అరుపులు విన్పించాయి. గేటు తీసుకుని బైటికొచ్చాను. కాంపౌండ్ గోడనానుకుని ఒకతను నిలబడి ఉన్నాడు. సన్నగా ఉన్నాడు. సుమారైన ఎత్తు. ముప్పయి ఐదేళ్ళకు మించని వయసు. గడ్డం మాసిపోయి ఉంది. చింపిరిగా రేగిపోయిన జుట్టు... చేతిలో పొడవాటి వేప మండ. దాన్ని గాల్లోకి వూపి బెదిరిస్తున్నాడు. తన ఎదురుగా ఎవరో ఉన్నట్టే పోట్లాడ్తున్నాడు. కళ్ళు క్రోధంతో ఎర్రగా ఉన్నాయి. మనిషి కోపంతో వూగిపోతున్నాడు. "ఫో... వెళ్ళిపో" వేపమండతో ఆ అదృశ్య వ్యక్తిని కొడ్తున్నాడు.

"వాచ్‌మన్ ఏడీ? ఇక్కడిలా న్యూసెన్స్ చేయకుండా వాణ్ణి పంపిచెయ్యొచ్చుగా" అన్నాను.

"అతన్ని యిక్కడివాళ్ళెవరూ ఏమీ అనరు... జాలి పడటం తప్ప. మూడేళ్ళ క్రితం వరకు ఈ కాంప్లెక్స్‌లోనే ఉండేవాడు. మన పై ఫ్లోర్‌లో స్వంత ఫ్లాట్ ఉండేది. బాగా చదువుకున్నవాడే. ఏదో ప్రైవేట్ కంపెనీలో పన్చేసేవాడు. పిచ్చి పట్టాక వైద్యం కోసం బాగా ఖర్చయింది. ఇక్కడి ఫ్లాట్ అమ్మేసి అద్దె యింట్లోకి మారారు"

"ఔనా... అయ్యో... మరి పిచ్చెలా పట్టింది?"

"అదే చూడండి ఎంత దురదృష్టమో... పదిహేనేళ్ళ క్రితం ఇతన్తోపాటు పన్చేసే అతను మాదాపూర్‌లో ప్లాట్ల వ్యాపారం మొదలెట్టాడట. గజం రెండొందల చొప్పున ఐదొందల గజాల స్థలం కొనమని బలవంతపెట్టాడట. బతిమాలుకున్నాడట. అదంతా అడవిలా ఉంది, అంత దూరంలో కొనడం దండగనుకుని ఇతను కొన్లేదట. మూడేళ్ళ క్రితమే అక్కడ గజం ధర పాతిక వేలు పలికిందిగా. అది విన్నప్పటినుండీ దిగులు పట్టుకుంది. ఎప్పుడూ ఆలోచిస్తూ విచారంగా ఉండేవాడు. అది కొననందుకు తన్నుతాను

తిట్టుకునేవాడు. మథన పడిపోయేవాడు. పగలు రాత్రి అదే ఆలోచన... ఆ ప్లాటు కొనుంటే కోటి రూపాయలు వచ్చుండేవని గుబులు పడీ పడీ పిచ్చోడిలా మారిపోయాడు"

"మరి పొడిచేస్తా చంపేస్తా అని ఎందుకరుస్తున్నాడు?"

"కోట్ల ధర పలికే స్థలం తన స్వంతమైనట్లు, దాన్ని కాజేయడానికి ఎవరో వచ్చినట్లు భ్రమ పడ్తుంటాడు. అందుకే దగ్గరికొస్తే పొడిచేస్తా అని బెదిరిస్తుంటాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం వూపందుకున్నాక మన హైద్రాబాద్‌లో ఎన్ని మర్డర్లు జరిగాయెూ మీకు తెల్సుగా. ఇతన్లా ఎంత మంది పిచ్చోళ్ళయినారో... యిక ముందు మరిన్ని మర్డర్లు జరుగుతాయి. యిప్పటికే అందరి మెదళ్ళలోకి డబ్బు పిచ్చి ఎక్కింది. చివరికి మినిస్టర్లు కూడా స్థలాల గొడవల్లో బజార్న పడ్తున్నారు. యింకెన్నెన్ని ఘోరాలు జరగనున్నాయెూ" అన్నాడు.

★ ★ ★

రెండ్రోజుల తర్వాత ఘట్‌కేసర్ వెళ్దామని బయల్దేరుతున్నప్పుడు అతను కన్పించాడు. మా అపార్ట్‌మెంట్స్‌కి ఎదురుగా నిలబడి ఎటుకో చూస్తున్నాడు. అమ్మాయిల్తో పరాచికాలాడ్తూ, జుట్టుకు రకరకాల రంగులేసుకుని, జడకు రిబ్బన్ కట్టుకుని కాలేజీకెళ్తున్న కుర్రాళ్ళని చూసి "పిచ్చోళ్ళు... పిచ్చోళ్ళు" అంటూ నవ్వాడు. నేనతన్నే గమనిస్తూ నిలబడ్డాను. ఎల్కేజీ, నర్సరీ చదివే పిల్లలు బస్తాడన్ని పుస్తకాలు మోసుకుంటూ మా పక్క వీధిలో ఉన్న స్కూలుకెళ్తున్నారు. వాళ్ళని చూసి మరలా "పిచ్చోళ్ళు... పిచ్చోళ్ళు" అంటూ నవ్వాడతను. పిచ్చిలో ఓ రకమైన వేదాంతం కూడా ఉంటుందేమోననిపించింది.

అతని గురించి ఆలోచిస్తూనే ఘట్‌కేసర్ బయల్దేరాను. దారిలో రోడ్డు కిరువైపులా ఎటు చూసినా వెంచర్లే... రైతుల దగ్గర పొలాల్ని తీసుకోవటం, వాళ్ళకు తృణమో పణమో అడ్వాన్స్‌గా యివ్వటం, జి. పి.ఏ. రాయించుకోవటం,

ప్లాట్లుగా చేసి పదింతల లాభాలకు అమ్ముకోవటం... యిదే తంతు. షంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఫ్యాబ్ సిటీ, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఔటర్ రింగ్ రోడ్‌లాంటి రకరకాల పేర్లతో వూరిస్తూ ,రంగు రంగుల స్వప్నాల్ని కష్టమర్ల కళ్ళముందుంచి ప్లాట్లను అంటగట్టే ఏజంట్లకు కమీషన్ కింద ప్లాట్ ధరలో ఐదో వంతు ఇవ్వడానికి కూడా కొన్ని కంపెనీలు ముందుకొస్తున్నాయంటే వాళ్ళు ఆర్జించే లాభం ఏ స్థాయిలో ఉంటుందో వూహించవచ్చు.

ఘట్‌కేసర్ చేరుకున్నాను. నా పదెకరాల పొలం... పచ్చగా... కళకళలాడ్తూ... నన్ను ఆప్యాయంగా కౌగిలించుకుంది. వెన్నెలంటే నాకెంతిష్టమో ఈ పొలమన్నా, ఇందులో  పండిస్తున్న పచ్చని పైర్లన్నా అంతే ఇష్టం. మా నాన్న కూడా వ్యవసాయమే చేసేటోడు. అమ్మానాన్న చనిపోయాక మా పల్లెటూర్లో ఉండటానికి మనసొప్పక ఇక్కడికొచ్చి ఐదెకరాల పొలం కొని కూరగాయలు పండించాను. బాగా లాభాలొచ్చాయి.  పక్కనే ఉన్న మరో ఐదెకరాలు కొని అందులో ధాన్యం పండిస్తున్నాను. జీవితం సాఫీగా సాగిపోవడానికి సరిపడినంత సంపాదన... ఆర్నెల్ల క్రితమే ఫ్యామిలీని హైద్రాబాద్‌కి మార్చాను... పెద్దబ్బాయి యింటర్మీడియెట్ చదువుకోసం. నాకు నచ్చినా నచ్చకున్నా నగరానికి వలస రావాల్సిన పరిస్థితి...

పదిహేను రోజుల క్రితం క్రిష్టారెడ్డి తన పొలాన్ని ఎవరో రియల్ ఎస్టేట్ వాళ్ళకు అమ్ముతున్నట్లు చెప్పాడు. అతని ఎనిమిదెకరాల పొలం నా పొలాన్ని ఆనుకునే ఉంది. ‘మంచి ధర యిస్తామంటున్నారు. ఎకరాకి పది లక్షలు. నీ పొలం కూడా కొంటామని చెప్పారు. నన్ను నీతో మాట్లాడమన్నారు. నీ పొలం నా పొలం కన్నా రోడ్డుకి దగ్గరగా ఉంది కాబట్టి యింకా ఎక్కువ రేటు పలకొచ్చు. ఏమంటావు?’ అని అడిగాడు క్రిష్టారెడ్డి.

‘పంటలు పండే బంగారంలాంటి మన పొలాల్ని వాళ్ళకమ్మితే దాన్ని బీడు

చేసి, చదును చేసి, ముక్కలుగా కోసి అమ్మేసుకుంటారు. దారుణం అన్పించటం లేదా నీకు? బీడు భూముల్ని సస్యశ్యామలం ఎలా చేయాలో ఆలోచించాల్సింది పోయి అక్వా కల్చర్ పేరుతో వేల ఎకరాల్ని చేపల చెరువులకింద మార్చేస్తున్నారు. అవి యింకెప్పుడు సేద్యానికి పనికిరాని చవిటి పర్రలుగా మారిపోయాయి. రియల్ ఎస్టేట్ల పేరుతో వందల వేల ఎకరాల్ని కొనేసి ప్లాట్లుచేసి అమ్మేస్తున్నారు. రైతులు డబ్బు మీది వ్యామోహంతో తమనిన్నాళ్ళూ ఆదుకున్న తల్లినేలని అమ్ముకుంటున్నారు. మరికొన్ని వందల సంవత్సరాలు తన కడుపులో పంటల్ని పండించి మన కడుపులు నింపాల్సిన సారవంతమైన నేలని బలవంతంగా గొడ్రాలిగా మార్చేసి, యిళ్ళ స్థలాలని మార్కెట్లో అమ్ముకుంటున్నారు. ఈ వేలం వెర్రి ఎన్నెన్ని అనర్థాలకు దారి తీస్తుందో ఎవ్వరూ ఆలోచించటం లేదు' అన్నాను.

'యింతకూ ఏమంటావ్? పొలం అమ్ముతానంటావా లేదంటావా... అర్థమయ్యేలా చెప్పు' అన్నాడు క్రిష్ణారెడ్డి.

'నన్ను పోషించిన ఈ పొలాన్ని కసాయివాళ్ళ కమ్మను'

అతను మరోసారి నా వైపు అర్థం కాలేదన్నట్లు చూసి 'నువ్వు కూడా ఈ పొలాన్ని పదేళ్ళ క్రితం మా తమ్ముడు సుబ్బారెడ్డి దగ్గర కొనలేదా... ఎకరం యాభై వేలకి. మీ పల్లెటూర్లో పొలాన్ని వేరే వాళ్ళకి అమ్ముకుని కదా వచ్చావు' అన్నాడు.

'ఔన్నిజమే. నా పొలాన్ని అమ్మాను. కసాయికి కాదు మరో రైతుకి. ఆ పొలాన్ని దున్ని, విత్తనాలు నాటి, నీళ్ళు చల్లి పంటల్ని పండించే నాలాంటి మరో రైతుకి... ఎప్పుడు మా వూరెళ్ళినా ఆ పొలానికెళ్ళి చూసుకుంటే చాలు పచ్చగా కళకళలాడుతున్న మొక్కలు పల్కరిస్తాయి. ఆ నేలతల్లి జవజీవాల్తో తుళ్ళిపడుతో కన్పిస్తుంది. నువ్వు చెప్పే వీళ్ళకమ్మెయటమంటే నేలని చంపేయటమే'

'వీళ్ళ కుడుంలా లక్షల డబ్బులు వస్తుంటే నేలని చంపేయటం నరికేయటం అంటావేమిటి? మన పొలాలు ప్రతేడూ పచ్చగా ఉన్నాయా? వర్షాల్లేక, నీటి వసతి లేక, పంట ఎన్ని సార్లు నష్టపోలేదూ... నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, పురుగు మందులు ... వీటి వల్ల ఎన్ని మార్లు మోసపోలేదూ... అంతా సజావుగా ఉంటే రైతులు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటారు?'

'రైతులు మోసపోయింది మనషుల స్వార్థం, దళారుల నీచత్వం, వడ్డీవ్యాపారుల క్రూరత్వం వల్ల తప్ప అది నేల తప్పు కాదు. వర్షాభావం, నీటి ఎద్దడి కూడా ప్రకృతి కాఠిన్యం వల్ల కాదు. మనం మన చేతులారా ప్రకృతి సమతుల్యాన్ని దెబ్బ తీయటం వల్లనే. ప్రకృతి చాలా దయ గలది కాబట్టే ఇంకా ఈ మాత్రమైనా మనగలుగుతున్నాం'

'నేనా నాలుగో క్లాసు తప్పిన రైతుని. నువ్వా డిగ్రీ చదివి వ్యవసాయంలో కొచ్చినోడివి. నీ భాష నాకర్థం కాదు. సరే. పొలం అమ్మటం విషయం మరో మారు ఆలోచించు' అన్చెప్పి క్రిష్ణారెడ్డి వెళ్ళిపోయాడు.

నా వెనక మనుషుల అలికిడైతే ఆలోచనల్లోంచి బైట పడి వెనక్కి తిరిగాను. నలుగురు మనుషులు నాకు సమీపంగా నిలబడి ఉన్నారు. అందులోంచి ఒకతను దగ్గరకొచ్చి "ఈ పొలం నీదేనా?" అని అడిగాడు. ఎందుకడుగుతున్నాడో అర్థంకాక "అవును. నాదే. ఏం" అన్నాను.

"ఈ పక్కనున్న క్రిష్ణారెడ్డి పొలాన్ని మేం కొన్నాం. నీ పొలం కూడా కొనేసి మొత్తాన్ని ప్లాట్లుచేసి అమ్మే వ్యాపారం చేయాలనుకుంటున్నాం. ఎంతకమ్ముతావో చెప్పు"

"అమ్మను"

"ఎకరాకి పదిలక్షలు. నీ పదెకరాలకి కోటి రూపాయలు. అంత డబ్బు జీవితంలో చూసి ఉండవు. ఆలోచించి చెప్పు. మరలా వారం తర్వాతొస్తాం"

"మరలా రానవసరం లేదు. పదెకరాలు కాదు కదా ఇందులో ఎకరా స్థలం కూడా అమ్మను"

"నీకేమైనా పిచ్చా? హైద్రాబాద్ శివార్లలో రైతులందరూ పొలాలు అమ్ముకుని ఎంత దర్జాగా బతుకుతున్నారో తెలీదా? కార్లలో తిరుగుతున్నారు. స్కాచ్ విస్కీ తాగుతున్నారు. వ్యవసాయం చేసుకుంటే ఏం మిగులుద్ది బూడిద? ఎన్నేళ్ళు వ్యవసాయం చేస్తే కోటి రూపాయలు సంపాయంచగలవ్? మా మాటిను. పొలం అమ్మేయి. బాగు పడ్తావ్"

"నాకేం డబ్బు పిచ్చిలేదు మీకున్నట్లు. నా సంపాదనతో తృప్తిగా బతుకుతున్నాను. దయచేసి విసిగించకుండా వెళ్ళిపొండి"

"ఈ రోజుల్లో డబ్బు కావాలనుకోవటం పిచ్చిగాదు. డబ్బు వద్దనుకోవటమే అసలైన పిచ్చి. అడ్డదిడ్డంగా ఎడాపెడా సంపాయిస్తేనే మగాడు... మొనగాడు. ఇయ్యాలేపు డబ్బు చాలా అవసరం. లేకపోతే రేపు నీ కన్న బిడ్డలు కూడా నీ మొహం చూడరు. బంగారంలాంటి అవకాశం. వదులుకోకు"

"నాకు అమ్మే అవసరం లేదు. ఉద్దేశం అంతకన్నా లేదు" అన్నాను పొలంలోకి వెళ్ళబోతూ.

"ఆగు. చివరి సారిగా చెప్తున్నాం ఎకరాకి పదిహేను లక్షలు. ఇదే ఫైనల్. కోటిన్నర. అగ్రిమెంట్ రాసుకుందాం. పది లక్షలు అడ్వాన్స్ ఇస్తాం. పొలం ఇచ్చేసి వెళ్ళిపో"

"చెప్తుంటే అర్థంకాదా... అమ్మనని చెప్పాగా" అన్నాను కోపంగా.

"నువ్వేమిటి అమ్మేది నీ బాబు కూడా అమ్ముతాడు. వేరే వూరి నుంచి పొట్ట చేత బట్టుకుని వచ్చావని జాలి పడ్తున్నాం. నకరాలు చేయకు. ల్యాండ్ మాఫియా గురించి నీకు సరిగ్గా తెల్సి ఉండదు. లేపేస్తాం. ఆలోచించుకో. మంచిగా చెప్తున్నాం విను. కోటిన్నర డబ్బు... మరలా వస్తాం" అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు.

వీళ్ళకు డబ్బు పిచ్చి సరే... మరి రైతుల బుద్ధేమయిందో... పంటలు పండించాల్సిన భూముల్ని ప్లాట్లు చేసి అమ్మేస్తే... పంటలెవరు పండిస్తారు? పొలాలన్నీ అదృశ్యమయ్యాక ధాన్యం, కూరగాయలు ఎక్కడ పండిస్తారు? అసలు పంటలే లేకపోతే ఈ మనుషులందరూ ఏం తిని బతుకుతారు? డబ్బు కట్టలా? లేక బియ్యం కంది పప్పు కూడా అమెరికాలాంటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటారేమో...

యింటికొచ్చాక పద్మతో జరిగిన విషయం చెప్పాను.

“కోటీ యాభై లక్షలా?” అంటూ గుండెల మీద చేతులు పెట్టుకుని, కళ్ళు పత్తికాయల్లా పెద్దవి చేసి నా వైపు చూస్తూ ఉండిపోయింది.

కొన్ని నిముషాలు నిశ్శబ్దంగా ఉన్నాక, “పొలం అమ్మితేనే మంచిదండీ. కోటిన్నర. మనం పాతిక లక్షలు పెట్టి మంచి ఫ్లాట్ కొనుక్కో వచ్చు. మరో పాతిక పెట్టి ఖరీదైన కారు, ఫర్నీచర్ కొనొచ్చు . మిగిలిన డబ్బులు బ్యాంక్‌లో ఫిక్సెడ్ చేసుకుంటే నెలకు ఎట్టా లేదన్నా లక్ష రూపాయల వడ్డీ వస్తుంది. మీరు కష్టపడి వ్యవసాయం చేయనక్కరలేదు. హాయిగా కాలుమీద కాలేసుకుని దర్జాగా బతకొచ్చు”

ఇంటర్ చదువుతున్న నా పెద్ద కొడుకు కళ్ళల్లో నక్షత్రాలు నింపుకుంటూ చెప్పాడు. “అవున్నాన్నా. కోటిన్నర డబ్బుల్ని కాదనుకోవటం ఫూలిష్‌నెస్. వ్యవసాయంలో ఏముంది నాన్న... మట్టి పిసుక్కోవటం తప్ప. మా క్లాస్‌లో చాలా మంది కార్లలో వస్తారు తెలుసా... మా నాన్న వ్యవసాయం చేస్తాడని చెప్పడానికి నాకెంత అవమానంగా ఉంటుందో.... మనం కోటి రూపాయలుపెట్టి పెద్ద బిజినెస్ చేయొచ్చు. ఒప్పేసుకో నాన్నా”

“కొద్దిగా బెట్టు చేయండి. మన పొలం అమ్మకపోతే వాళ్ళు కొన్న క్రిష్టారెడ్డి పొలంలోకి వెళ్ళడానికి దారిలేదు కాబట్టి చచ్చినట్లు రేటు పెంచుతారు. ఎకరం ఇరవై లక్షలు పలకొచ్చు. అంత కాకున్నా పదిహేడో పద్దెనిమిదో అయితే

గ్యారంటీ" అంది.

"ఏ పనీ చేయకుండా కాలుమీద కాలేసుకుని బతికే బతుకు దర్జా బతుకని నేననుకోను. నా పొలంలో కాయకష్టంతో సంపాయించే డబ్బుతో నేను దర్జాగా బతుకుతున్నాను. తృప్తిగా బతుకుతున్నాను. మా నాన్న పొలాన్ని నమ్ముకుని బతికాడు. నేనూ మట్టిని నమ్ముకున్నవాణ్ణే. నేను నమ్ముకున్న దాన్ని అమ్ముకునే పొరపాటు చేయను. కోటిన్నర కాదు కదా నిలువెత్తు బంగారం ఇస్తామన్నా సరే నేను పొలాన్ని అమ్మను" అన్నాను.

వాళ్ళిద్దరూ నావైపు అదోలా చూశారు. వాళ్ళ కళ్ళలో నిరాశ, నిరసన స్పష్టంగా కన్పిస్తూ ...

డబ్బుది పశుబలం... గాఢమైన అనుబంధాల్ని కూడా క్షణాల్లో పుటుక్కున తుంపెయ్యగలదు. డబ్బు మహా మోహిని. ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే ముని పుంగవులను సైతం తన పాదాక్రాంతం చేసుకోగలదు.

★ ★ ★

పొలంలో కూరగాయల మొక్కల దగ్గర నిలబడ్డాను. టమేటా బాగానే పండింది కానీ బెండకు చీడ పట్టింది. వంకాయకు పురుగు పట్టి రంధ్రాలు పడిపోతున్నాయి. పురుగు మందులు ఎక్కువగా చల్లటం ఇష్టం ఉండదు. అలాగని చూస్తూ చూస్తూ పంటను నాశనం చేసుకోలేని పరిస్థితి...

అలికిడికి వెనక్కి తిరిగి చూసాను. ఆరుగురు మనుషులు నిలబడి ఉన్నారు. బలిష్టంగా... క్రూరంగా... అందులో మొన్న నాదగ్గరకొచ్చి పొలం అమ్మమని అడిగిన వాళ్ళు కూడా ఉన్నారు.

"ఏంటీ మరలా వచ్చారు?" అన్నాను భావరహితంగా ఉండటానికి ప్రయత్నిస్తూ.

"సువ్వీ పొలం మాకమ్మేవరకూ నిన్నొదలం" అన్నాడతను.

"మీరేం చేసుకుంటారో చేసుకోండి. నా ప్రాణం పోయినా ఈ పొలం అమ్మను"

"ఇలా చేస్తే నీ కాళ్ళబేరానికొచ్చి రేటు పెంచుతామని అనుకుంటున్నావేమో... మేం చెప్పిన రేటుకే మాకమ్మాల"

"అమ్మనని ఎన్ని సార్లు చెప్పాలి?"

"చూడు. నీ గురించి అంతా తెల్సుకున్నాం. నువ్వెక్కడుంటావూ... నీపిల్లలెంతమందీ ... ఎక్కడ చదువుతున్నారూ... మొత్తం తెలుసు. మాగురించే నీకు తెలీదు. చివరిసారిగా హెచ్చరిస్తున్నాం"

"మీ బెదిరింపులకు భయపడను. పొండి. మీ చాతనైంది చేసుకోండి. మరోసారి వచ్చారో పోలీస్ కంప్లెయింట్ ఇస్తాను" అన్నాను. నా వైపు కోపంగా చూస్తూ వెళ్ళిపోయారు.

మొక్కలకు చీడ పడితే పురుగు మందులున్నట్లు వీళ్ళ మెదళ్ళకు పట్టిన పురుగుని చంపడానికి బలమైన, కల్తీలేని పురుగుమందుంటే బావుండు...

వూళ్ళో మిగతా పనులు ముగించుకుని బయల్దేరేప్పటికే ఎనిమిది దాటింది. నిండు పున్నమి... చందమామ గుండ్రంగా చుట్టిన బంతిపూల చెండులా ఉన్నాడు. పుచ్చపూవులా విరగకాస్తోన్న వెన్నెల... ఎంత హాయిగా ఉందో మనసుకి... ఆ వెధవలు చిమ్మిపోయిన విషపు చుక్కలు ఇగిరిపోయి హృదయంలో మొలకెత్తుతున్న అమృతం మొక్కలు...

మా కాంప్లెక్స్ మరో ఫర్లాంగు దూరంలో ఉందనగా స్కూటర్‌కి అడ్డొచ్చారెవరో. ఆపిన వెంటనే నన్ను స్కూటర్ పైనుంచి లాగి కింద పడేశారు. పైన నలుగురు పడి కాళ్ళతో చేతుల్తో కొడ్తున్నారు. అరవడానికి కూడా అవకాశం లేకుండా వెంటవెంటనే పడ్తోన్న దెబ్బలు... ఒకడు కత్తి బైటికి తీసి పొట్టలో పొడిచి మెలి తిప్పాడు. రక్తంతో వళ్ళంతా తడిచిపోతూ... బాధకు చచ్చిపోతాననిపించింది. భార్యా పిల్లలు గుర్తొచ్చారు. పదెకరాల పొలం

గుర్తొచ్చింది. నేను చచ్చిపోయాక దాన్ని లాక్కుంటే పిల్లల గతేం కాను? వెన్నులో జరజరా పాకుతూ భయం...

ఎవరో అంబులెన్స్‌కి ఫోన్ చేశారు. హాస్పిటల్లో చావు బతుకుల మధ్య నాలుగు రోజుల పోరాటం తర్వాత స్పృహలోకొచ్చాను.

"డబ్బుకాశపడి పొలం అమ్మేయమన్నానండి. పాపిష్ఠిదాన్ని. ఇపుడా డబ్బు కూడా వద్దండి. వాళ్ళడిగిన పొలం వాళ్ళకిచ్చేయండి. నాకు మీరు బాగుంటే చాలు." అంటూ నన్ను చుట్టుకుని భోరున ఏడ్చింది పద్మ.

"నాన్నా. మనకు బిజినెస్ లేకున్నా, కారు లేకున్నా పర్లేదు. నువ్వుంటే చాలు" అన్నాడు పెద్ద కొడుకు.

యింతకు ముందు పొరబడ్డాను... కొన్ని అనుబంధాల్ని డబ్బే కాదు ఏదీ తెంపలేదు.

పోలీస్ స్టేషన్లో కంప్లెయింట్ యిచ్చాను. వాళ్ళు హాస్పిటల్‌కొచ్చి నా వాంగ్మూలాన్ని రాసుకుని వెళ్ళారు. పూర్తిగా కోలుకోడానికి నెలపైనే పట్టింది.

చాలా రోజుల తర్వాత పొలానికెళ్ళి, నా కోసం ఎదురుచూస్తున్న మొక్కల్ని తనివిదీరా పల్కరించాక యింటికి తిరిగొచ్చిన అరగంటకే పోలీస్ స్టేషన్ నుండి కబురొచ్చింది.

"మరో పది లక్షలు ఎక్కువిస్తానన్నారు. కోటి అరవై లక్షలు. పొలాన్ని అమ్మేయి. వ్యవసాయమే చేయాలనుకుంటే అదే డబ్బుతో పాతికెకరాలు మరెక్కడైనా కొనుక్కో. పిచ్చోడిలా ఉన్నావే. నీ పెళ్ళాంబిడ్డల అదృష్టం బావుండి మొన్న బతికి బట్టకట్టావు. నువ్వు చస్తే వాళ్ళకు దిక్కెవరు? పోలీస్ కేస్ వల్ల లాభమేం ఉండదు. వాళ్ళు బాగా డబ్బు, పలుకుబడి గలవాళ్ళు. వాళ్ళకేమీ కాదు. నామాటిను" అన్నాడు యస్సై.

"వ్యవసాయం చేయటం నా వృత్తి. దాన్ని ఎప్పటికీ వదులుకోను. మీరు

చెప్పినట్లు ఇదే డబ్బుతో మరో చోట పొలం కొనుక్కోవచ్చు. కానీ పంట పండే పొలాల్ని ఇలా ముక్కలు చేసి అమ్ముకోడానికి నేను వ్యతిరేకిని. వాళ్ళూ వ్యవసాయం చేస్తానంటే చెప్పండి. మనకు తిండిని సమకూర్చిపెడ్తున్న భూమిని లక్షలు వస్తున్నాయన్న ఆశతో యిళ్ళ స్థలాలు చేసేస్తే మన ముందు తరాలవారికి తినడానికి తిండి గింజలు దొరకవు" అన్నాను.

"నచ్చచెప్తే అర్థం చేసుకుంటావని పిలిపించాను. బాగా సెంటిమెంటల్ లా ఉన్నావే... నీ ఖర్మ ...వెళ్ళు" అన్నాడు. సెంటిమెంటల్ అనేటప్పుడు కావాలనే మెంటల్ అనే చోట వత్తి పలికాడు. సెంటిమెంటల్ ఫూల్ అని మనసులో అనుకుని ఉంటాడు. నిజమే ... ఏటికి ఎదురీదే ప్రతివాడూ సమాజం కళ్ళకు పిచ్చివాడిలానే కన్పిస్తాడు. నలుగురు నడిచే బాటలో నడవకుండా వేరే మార్గం వెతుక్కున్న వాణ్ణి పయనీర్ అని పొగడదు...పిచ్చివాడనే అంటుంది లోకం.

తిరిగొస్తుంటే మా కాంప్లెక్స్ ప్రహరీ గోడ బైట నిలబడి ఉన్నాడతను. చేతిలో వేప మండలు... చింపిరి జుత్తు... నన్ను చూసి "పిచ్చోడు... పిచ్చోడు" అంటూ నవ్వాడు.

***(వార్త ఆదివారం. 27 ఏప్రిల్ 2009)***

★ ★ ★